# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 12, ఫిబ్రవరి 2026





## ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్

★ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లాలో సగటున 42 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆమె వెల్లడించారు. భైంసాలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. భైంసాలో ఏర్పాటు చేసిన పర్యావరణ హిత గ్రీన్ పోలింగ్ స్టేషన్‌ను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రతి కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, ఓటర్ల జాబితాలో ఇబ్బందులు ఉంటే సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత కల్పించామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉన్నందున ప్రతి ఓటరు ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



## ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా పండుగ వాతావరణంలో కొనసాగాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోలింగ్ కొనసాగింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. సాయంత్రం 5 గంటలలోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు. ఆసిఫాబాద్ పురపాలక సంఘంగా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జరుగుతున్న ఎన్నికలు కావడంతో స్థానిక ఓటర్లలో ఉత్సాహం పెరిగింది. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకే 61.72 శాతం ఓటింగ్ జరిగింది. జిల్లాలోని రెండు మున్సిపాలిటీల పరిధిలోని 50 వార్డులకు గాను 134 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. 7 గంటలకు మందకోడీగా ప్రారంభమైన ఓటింగ్ జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో ఉదయం 9 గంటల వరకు 7422 ఓట్లతో 13.1శాతం , 11 గంటలకు 19039 ఓట్లతో 33.1 , మధ్యాహ్నం 1 గంటకు 31062 ఓట్లతో 52.7 , మధ్యాహ్నం 3 గంటలకు 38737 ఓట్లతో 64.2 , సాయంత్రం 5 ఓటింగ్ ముగిసే సమయానికి 43754 ఓట్లతో 70.99 శాతం నమోదైంది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 77.67శాతం నమోదు కాగా కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 64.32శాతం పోలింగ్ నమోదు అయింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తుతో పాటు వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రముఖులు మిగతా 2లో..



## ప్రశాంతంగా పోలింగ్ పూర్తి..

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని, అందుకు తగ్గా పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆసిఫాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా ఆసిఫాబాద్, మిగతా 2లో..



## వన్యప్రాణుల వేటగాళ్ళు అరెస్ట్



**వేమనపల్లి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నీల్వాయి రేంజ్ పరిధిలోని బద్దెవెల్లి శివారులో వన్యప్రాణులను అక్రమంగా కరెంట్ తీగలు అమర్చి హతమార్చే ముఠాను బుధవారం పట్టుకున్నట్లు నీల్వాయి అటవీ రేంజ్ అధికారి హాఫీజుద్దీన్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బద్దెవెల్లి శివారులో అక్రమంగా కరెంట్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్నారని సమాచారం రావడంతో రాత్రి సమయంలో మిగతా 2లో..

## మోతిగూడ గ్రామస్తులకు త్రాగునీటి కోసం తప్పని తిప్పలు

**లింగాపూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**



లింగాపూర్ మండలంలో జముల్దార గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మోతిగూడా గ్రామంలో బోరుబావి త్రవ్వుతుండగా ఫారెస్ట్ అధికారులు మీగ్రామంలో బోరు బావి వేయరాదు అని గ్రామస్తులను బోరు బావి వెయ్యనీయకుండా అడ్డుకున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మేము తాత ముత్తాతల కాలం నుండి ఇదే ప్రాంతంలో నివసిస్తున్నాము కనీసం తాగడానికి నీళ్ల లేకుండా మిగతా 2లో..

# ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు

(మొదటిపేజీ తరువాయి)

మాజీ డిసిసి అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నెల 13న ఆసిఫాబాద్ లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కాగజనగర్ లోని డిఏవి పాఠశాలలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. దీనికి గాను అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు.



# ప్రశాంతంగా పోలింగ్ పూర్తి..

(మొదటిపేజీ తరువాయి)

కాగజ్ నగర్ మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న పోలింగ్ సరళిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని 20 వార్డులకు గాను 28 పోలింగ్ కేంద్రాలు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు గాను 85 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడంతో పాటు వృద్ధులు, దివ్యాంగుల కొరకు ప్రత్యేక వీల్ చైర్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ ఏర్పాటు చేయడం జరిగిందని, అత్యవసర వైద్య సేవలను నిమిత్తం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల వేటగాళ్ళు అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్ కుమార్, ఎఫ్‌బిఓ మహిపాల్ విద్యుత్ అధికారులతో కలిసి సంఘటన స్థలంలో పరిశీలించగా అనుమానస్పదంగా ముగ్గురు వ్యక్తులు పెరగాని రాజకుమార్, దుర్గం రాజన్న, హనుమాన్ల సంతోష్ కనిపించగా వారిని విచారించగా నేరం అంగీకరించడంతో వారిపైన వన్యప్రాణుల రక్షణ చట్టం 1972 ప్రకారం ముగ్గురు పైన కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. అట్టి స్థలంలో 300 మీటర్ల కరెంటు తీగ 2.5కేజీ, 19 గుటీలను తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీల్వాయి రేంజ్ పరిధిలో ఎవరైన వన్యప్రాణులకు నష్టం జరిగిస్తే వన్యప్రాణుల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# మోతిగూడ గ్రామస్తులకు త్రాగునీటి కోసం తప్పని తిప్పలు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు ఇది ఎక్కడి న్యాయం అని గ్రామస్తులు వాపోయారు, మా ఏజెన్సీ గ్రామాలలో పిసా యాక్ట్ ప్రకారం గ్రామసభ అనుమతి లేనిది టైగర్ జోన్ ఏరియా ఎలా గుర్తించుకున్నారు అని మోతిగూడ గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులను నిలదీశారు. నిత్యం త్రాగు నీటి కోసం రెండు కిలోమీటర్ల నుంచి తాగడానికి నీళ్ళు తీసుకు వస్తున్నామని అసలే వేసవికాలం కావడంతో నీటి కొరత ఎక్కువగా ఉంటదన్నారు,త్రాగునీరు లేకుండా ఎలా బ్రతకడమని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులతో ఉన్న మా భూమి సమస్యలను పరిష్కరించి మాకు బోరు బావి వేసి నీటి సమస్య తీర్చాలని మోతిగూడ గ్రామస్తులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# తండ్రి కోసం ఓటేసేందుకు విదేశాల నుంచి వచ్చిన కూతురు



కూతురితో భారాస అభ్యర్థి చిలివేరి వెంకటేశ్వర్లు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11,ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తన తండ్రి కోసం లండన్ దేశం నుండి ఓటు వేసేందుకు ఓటరు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఆరో వార్డులో బారాస తరపున సీనియర్ నాయకుడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరి వెంకటేశ్వర్లు బరిలో ఉండగా ఆయన కూతురు చిలువేరి శ్రేయ లండన్ లో ఎమ్మెస్ పూర్తి చేసిన ఆమె నెల రోజుల ముందు నుంచి ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకుని తన అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వదేశానికి చేరుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ముఖ్యం కాగా ఒక్క ఓటు సైతం గెలుపుఓటములను తారుమారు చేసే పరిస్థితులు సైతం ఉంటాయి. ఈ క్రమంలో తన తండ్రికి ఓటు వేసి మద్దతు తెలిపేందుకు జిల్లా కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ ఉర్దూ పాఠశాలలో తన అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటును వినియోగించుకునేందుకు విదేశం నుంచి స్వదేశానికి రావడంతో కుటుంబ సభ్యులు, ఆమె స్నేహితులు అభినందించారు.

# పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా వైద్యాధికారి డా. ఎస్. అనిత

**మందమర్రి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**




మందమర్రి మండలంలోని దీపక్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. అనిత సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి, సిబ్బందితో సమావేశమై కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, కార్యక్రమాలపై సమగ్రంగా తెలుసుకున్నారు. వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న వివిధ వైద్య సేవలు, వాటి వివరాలను సమీక్షించారు. అసంక్రమణ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తుగా కేసులను గుర్తించి అవసరమైన మందులు అందించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలు, ఇతర పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాలని, వంట సిబ్బందికి పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. గర్భిణీ మహిళల 100 శాతం నమోదు, సమయానుసారం టీకాలు అందించడం, క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా కేసులను ముందుగానే గుర్తించడం, మొబైల్ ఎక్స్‌రే ద్వారా మారుమూల ప్రాంతాల్లో సేవలు విస్తరించాలన్నారు. కేంద్రంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన పోస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారం స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో అవగాహన అత్యంత కీలకమని డాక్టర్ ఎస్. అనిత పేర్కొన్నారు.



# నేడు తాండూర్ జిపిలో ఉచిత వైద్య శిబిరం

**తాండూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :**

టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12 న తాండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ముడిమడుగుల సురేష్ తెలిపారు. ప్రత్యేక వైద్యులు టీబీ నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని సర్పంచ్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం తీసుకొని వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు.

# భారత్ బంద్‌కు కాంగ్రెస్ పూర్తి మద్దతు

**- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

కేంద్ర కార్మిక, రైతు సంఘాల మద్దతుతో నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె (భారత్ బంద్)కు పూర్తి ఐక్యతా మద్దతు తెలుపుతున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక సంస్కరణలు, కొత్త లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాచేలా ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగ భద్రతను తగ్గించి, యజమానులకు అధిక స్వేచ్ఛ కల్పించడం ద్వారా కార్మికుల జీవనోపాధిపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఈ బంద్‌కు రైతు సంఘాలు మద్దతు తెలపడంతో పరిస్థితులను అర్థం చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 12న నిర్వహించనున్న బంద్ లో కుమురం భీం జిల్లాలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## బాల్య వివాహాల నియంత్రణే లక్ష్యం

### - మహిళా సాధికారత కేంద్రం

**జైనూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

బాలికల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో జైనూర్ మండలంలోని జంగం, పోచం లోద్ధి కేజీబీవీ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ప్రతినిధులు సాగర్, రాణి బాలికల సంరక్షణ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఇందుకు పాల్పడే వారు కఠిన శిక్షకు అర్హులని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహాల నిరోధానికి చైల్డ్ హెల్ప్ లైన్ 1098, గృహహింస నివారణకు 181 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. 18 ఏళ్లలోపు బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరా, సర్పంచ్ అనసూయ, పంచాయతీ కార్యదర్శి మనోజ్ కుమార్, కేజీబీవీ ఎస్ఓ సుమలత తదితరులు పాల్గొన్నారు.



## గ్రామైక్య సంఘ భవన నిర్మాణ పనులు ప్రారంభం

**జైనూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

జైనూర్ మండలం పానపటార్ గ్రామ పంచాయతీలో గ్రామైక్య సంఘ భవన నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ ఆత్రం తులసి శంకర్ ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద ఈ భవన నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మహిళా సంఘ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను మొదలుపెట్టారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన భవన నిర్మాణంతో మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించుకోవడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. భవన నిర్మాణంలో నాణ్యత లోపించకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం భీంరావ్, గ్రామ పెద్దలు లక్ష్మణ్ రావ్, బాలు, శంకర్, మహిళా సంఘ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, వీఓ సంఘ నాయకురాలు శాంతబాయి, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

**సారంగాపూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పరికిపల్లి స్వదేశ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత హాస్టల్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. బేసిక్ కంప్యూటర్స్, అకౌంట్ అసిస్టెంట్, కంప్యూటర్ హార్డ్వేర్, ఆటోమొబైల్ టూ వీలర్ రిపేర్, సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సోలార్ సిస్టమ్ వంటి విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 18 నుండి 30 ఏళ్ల లోపు వయస్సు ఉండి, పదో తరగతి, ఇంటర్ లేదా డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల యువత 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని మండల యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రశాంతంగా కొనసాగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

### - మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా మున్సిపాలిటీలలో కొనసాగుతున్న ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని రామకృష్ణాపూర్ ప్రాంతంలో గల అల్ఫోన్సా ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టడం జరిగిందని, ఈ క్రమంలో అర్హులైన ఓటర్లు నిర్ణీత సమయంలోగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ స్థాయి ఏజెంట్లు కృషి చేయాలని సూచించారు. సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం గేటు మూసివేసి, లోపల ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు, చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్, నోడల్ అధికారులు, పి.ఓ.లు, ఎ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లు, వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెల్, ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు అవసరమైన త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎస్సై ఇస్లావత్ నరేష్

## మహాశివరాత్రి జాతర గోడపత్రికల ఆవిష్కరణ

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

మండలంలోని కర్జెల్లి గ్రామ ముసలమ్మ గుట్ట శివాలయ మహా శివరాత్రి జాతర గోడ పత్రికలను బుధవారం ఎస్సై ఇస్లావత్ నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులు జాతరను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఆలయ కమిటీ భక్తులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన కార్పొరేషన్ ఎన్నికలు

**హాజీపూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**



మంచిర్యాల కార్పొరేషన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుండే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. 16వ వార్డులోని పోలింగ్ బూత్‌లను ఎన్నికల పరిశీలకులు గంగాధర్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ ఓటర్లకు పలు సూచనలు చేశారు. కాగా, గుడిపేట 17వ వార్డులోని పోలింగ్ కేంద్రంలో వీల్ చైర్లు అందుబాటులో లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## మహిళపై అడవి పంది దాడి

**వేమనపల్లి, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త**

అడవి పంది దాడిలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన వేమనపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వేమనపల్లి గ్రామానికి చెందిన తుమ్మిడ ప్రేమన్నకు వ్యవసాయ చేనులో పని చేస్తున్న తొర్రెం మధునక్కపై అడవి పంది ఆకస్మికంగా దాడి చేసింది. ఉదయం వ్యవసాయ పనులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఆమెకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనను గమనించిన స్థానిక రైతులు, గ్రామస్తులు వెంటనే స్పందించి గాయపడిన మధునక్కను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో బాధితురాలని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించాలని కోరారు. ఈ సంఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గత కొంతకాలంగా గ్రామ పరిసరాల్లో అడవి పందుల సంచారం పెరిగిందని రైతులు చెబుతున్నారు. పంటలకు నష్టం కలిగించడమే కాకుండా, రైతుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అడవి జంతువుల సంచారాన్ని నియంత్రించి రైతులకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**- టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి**



సమావేశంలో మాట్లాడుతున్న వైద్య శాంతి కుమారి

**సిర్పూర్ (టి), ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు హరీష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోర్సుగా నోటిఫికేషన్ జారీ చేసింది నాలుగు లేబర్ కోడ్స్‌ని వెనక్కి తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఉపాధి చట్టం కార్మిక చట్టాలను సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, సిపిఎస్ ను రద్దుచేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరీష్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ సుభాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడివో మల్లేష్

## తిర్యానిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**తిర్యాని, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

సంపూర్ణత అభియాన్ 2.0 లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో పాటు బాలికల సైన్స్ డే ను బుధవారం స్థానిక గురుకుల పాఠశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికలకు, మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత, సైన్స్ పై అవగాహన కల్పించారు. కిషోర బాలికలకు పౌష్టిక ఆహారముపై అలాగే మరుగుదొడ్ల నిర్వహణ, వినియోగంపై,వ్యక్తిగత పరిశుభ్రత,సురక్షిత మంచినీరు, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేముల మల్లేష్, మండల పంచాయతీ అధికారి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



## 108 వాహనాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారి

**తాండూర్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని 108 వాహనాన్ని బుధవారం జిల్లా అధికారి కొండలరావు అకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలోని వైద్య పరికరాలు, మందులను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేస్తూ మండల ప్రజలకు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని 108 వాహనం పైలెట్ తిరుపతి, ఈఎంటి శివకృష్ణ లకు సూచించారు.



108 వాహనాలు తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి కొండలరావు



మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు,భక్తులు

## ఘనంగా ఎల్లమ్మ బోనాలు

**జన్నారం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

జన్నారం గ్రామంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న గౌడ కులస్తుల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు బుధవారంతో వైభవంగా ముగిశాయి. మంగళవారం రాత్రి మహిళలు ఇంటికొక బోనం చొప్పున తీసుకొని వెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. బుధవారం ఆలయం వద్ద బైండ్ల కులస్తుల చేత పట్నాలు వేసి, మేకపిల్లను గావు పట్టారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ బోనాల పండుగలో గౌడ కులస్తులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సమీపంలోని తాటి చెట్టును 13 మంది గీత కార్మికులు ఎక్కి, పైనుండి ఒకరి నుంచి ఒకరికి కల్లు కుండను మారుస్తూ కిందకు దించి అమ్మవారికి సమర్పించారు.

## బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని బూరుగూడ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సహకారంతో కలజాత బృందం చేత రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులు సైబర్ మోసాలకు గురికాకూడదని, ఫోన్ కు వచ్చే ఏపీకే ఫైల్స్ ను ఓపెన్ చేయకూడదన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే బ్యాంక్ లో సంప్రదించాలని అన్నారు. అదేవిధంగా బ్యాంక్ నుండి పంట, మడిగేజ్, వ్యాపార అభివృధి, ముద్ర నుండి రుణాలను అందిస్తున్నామని, వీటిని అర్హులైన ఖాతాదారులు తీసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సైతం సమయానికి చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కోఆర్డినేటర్ లు ప్రశాంత్, సంజీవ్, నాయకులు మేకర్తి లక్ష్మణ్, పుదరి శ్రీనివాస్, గోపాల్, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

## వాంకిడి శివకేశవ మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

**వాంకిడి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

వాంకిడి మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ, భక్తులు ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఉత్సవాలు ఈ నెల 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ నెల 14న గంగా జలంతో అభిషేకం నిర్వహించి జాతర ప్రారంభం అవుతుందన్నారు.15న సాయంత్రం 5 గంటలకు పల్లకి సేవ, రథోత్సవం నిర్వహించబడుతుందని అలాగే 16న ఉదయం 10 గంటలకు శివపార్వతి కళ్యాణం జరుగుతందని అనంతరం సాయంత్రం 6 గంటలకు గంగా హారతి నిర్వహించడంతో మూడు రోజుల జాతర ముగుస్తుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## మున్సిపాలిటిల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నాం

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ మున్సిపాలిటిలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకునట్టు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలురు పాఠశాల, బాలికల పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా మౌళిక వసతులు కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా దివ్యాంగుల సౌకర్యార్ధం వీల్ చైర్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. అత్యవసర సమయంలో వైద్య సిబ్బంది అందుభాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఇబ్బంది తలేతకుండా ప్రశాంతంగా ఓటు వినియోగించుకున్నేదుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్బంగా జిల్లా అదనపు కలెక్టర్ పోలింగ్ కేంద్రం 12లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ గజనంద్, పోలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





రైతులకు అవగాహన కల్పిస్తున్న కలజాత బృందం

## తాండూర్‌కు చేరిన యువకుడి సైకిల్ యాత్ర

**తాండూర్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త :**




భారతీయ సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ఒడిశా రాష్ట్రం ఝూర్సుగూడ జిల్లా బెల్పహార్ జురా గ్రామానికి చెందిన యువకుడు సుబ్రత్ మహరాణా చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం తాండూర్ మండల కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా యువకుడు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు పద్మనాభ మహారాణా, సుకాంతి మహారాణ ప్రోత్సాహంతో పది రోజుల క్రితం స్వగ్రామం నుండి సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. గోవుల పరిరక్షణ కోసం గతంలో ఎన్ని రాష్ట్రాలలో సైకిల్ యాత్ర నిర్వహించి గోవుల సంరక్షణ పై ప్రజలకు అవగాహన పంపించినట్లు తెలిపారు. ఉత్తర భారతదేశంలోని చార్ధామ్ పుణ్యక్షేత్రాలతో తెలంగాణ రాష్ట్రంలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం, తిరుపతి, అరుణాచలం, రామేశ్వరం పుణ్యక్షేత్రాల దర్శనంతో యాత్ర ముగుస్తుందని వివరించారు.